
ఈనాడు చిత్తూరు
సోమవారం అక్టోబరు 7, 2024


సింహ వాహనంపై యోగనరసింహునిగా శ్రీవారు


స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాసనాన.. ముత్యాలమేనా

బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు వైభవం


ముత్యాలపందిరిపై విహరిస్తూ..





తిరుమల, న్యూస్‌టుడే: సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆదివారం సింహ, ముత్యపు పందిరి వాహన సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం మలయప్ప స్వామివారు యోగనరసింహుని అలంకారంలో దర్శనమిచ్చారు. వాహనం ఎదుట గజ రాజులు నడుస్తుండగా శ్రీవారు దుష్ట శిక్షణ, శిష్టరక్షణ కోసం సింహంపై కూర్చుని ఊరేగారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహా ధ్వనికి సంకేతం. రాత్రికి ముత్యపు పందిరి వాహనంపై శ్రీదేవి, భూదేవితో కలిసి బకాసుర వధ అలంకారంలో భక్తులను కనువిందు చేశారు. ఈ దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని చేకూరుస్తుందని విశ్వాసం. తితిదే ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మికానందం కలిగించాయి.

నేటి వాహన సేవలు

బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం ఉదయం 8-10 గంటల వరకు కల్పవృక్ష వాహన సేవ, మధ్యాహ్నం 1-3 గంటల వరకు స్నపన తిరుమంజనం, రాత్రి 7-9 గంటల వరకు సర్వభూపాల వాహన సేవ జరగనుంది.



గరుడ సేవకు విస్తృత ఏర్పాట్లు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం జరిగే గరుడ వాహన సేవలను దాదాపు రెండు లక్షల మంది భక్తులు గ్యాలరీల్లోంచి వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు తితిదే ఈవో జె.శ్యామలరావు తెలిపారు. అంతర్గత రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డులో వేచిఉండే భక్తులకు సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవిందనిలయం నార్త్‌వెస్ట్ కార్నర్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు లగేజీ లేకుండా క్యూలైన్‌లో ప్రవేశించాలని సూచించారు.













కనబడుట లేదు


ఆర్.భారతి
గాజులమండ్యం

ఆర్.భారతి, వయస్సు(33)
ఈ ఫోటోలోని ఆమె 18-9-2024 సా॥ 6.00 గం॥ నుంచి కనబడుటలేదు.
ఎత్తు: 5" అ॥, చామనఛాయ, మెరున్ కలర్ చీర ధరించి ఉంది.
ఈమె ఆచూకి తెలిసిన వారు క్రింది నెంబర్లకు తెలియజేయగలరు.
తగిన పారితోషికం ఇవ్వబడును.
భర్త: ఆర్.సుధాకర్ రెడ్డి
99594 13067,
Con:83746 00656
77805 11332
గాజులమండ్యం, తిరుపతి జిల్లా.

జలవనరుల శాఖలో.. ఆ పనులు నిలిపేయండి

◆ 25శాతం లోపు ఉంటే రద్దు ◆ రూ.385 కోట్ల విలువచేసే 13 పనులు ప్రశ్నార్థకమేనా..?

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం జిల్లాలో సాగునీటి వనరులైన చెరువులు, కాలువల అభివృద్ధి పనులను గాలికొదిలేసింది. సాగునీటి అభివృద్ధి పనుల పేరుతో ప్రతిపాదనలు, మంజూరులు తప్ప.. పనుల నిర్వహణ ఊసే లేదు. చేపట్టిన పనులు ప్రారంభ దశలోనే ఆగిపోయాయి. జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి అభివృద్ధి పనులు 25 శాతం లోపే ప్రగతి ఉంటే వెంటనే ఆపేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుత్తేదారులతో నిర్దేశ ఒప్పందం జరిగిన అనంతరం భౌతికంగా పాతిక శాతం లోపే చేసిన వాటిని తక్షణమే గుర్తించాలని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారుల ఆదేశాలతో జిల్లా జలవనరుల శాఖ 13 పనులు గుర్తించి ప్రభుత్వానికి నివేదించింది.

విజయపురం మండలం పన్నూరు చెరువు పునరుద్ధరణ పనులు రూ.42.14 లక్షలు, అదే మండలం కాళియంబాకం గ్రామం రాలిలంబారం పెద్ద చెరువు రూ.86లక్షలు, విజయపురం చెరువు రూ.75లక్షలు, కన్నికమ్మ కోన చెరువు రూ.74లక్షల పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కొత్త చెరువుల నిర్మాణ పనులకు సంబంధించి నగరి మండలం మొక్కలకండిగ కొత్త చెరువు రూ.78.12కోట్లు, నగరి చెరువు మిగులు జలాలు చెరువులకు అనుసంధానం పనులకు రూ. 92.79లక్షలు, అదే మండలం సత్రవాడ అనకట్ట అభివృద్ధి పనులకు రూ.3.15కోట్లు, కార్వేటినగరం మండలం కత్తెరపల్లె వద్ద కొత్త చెరువు నిర్మాణానికి 85.95కోట్లు.. పెనుమూరు మండలం కలవకుంట ఎన్టీఆర్ జలాశయం మిగులు జలాలను పెనుమూరు, గంగాధరనెల్లూరు మండలాల్లోని చెరువులకు అనుసంధానం పనులు రూ.193.22కోట్లతో.. కుప్పంలో పాలారు నదికి అనుసంధానంగా జలాశయం నిర్మాణం రూ.21.48కోట్లు, పుంగనూరు, చౌడేపల్లె మండలాల్లో కౌండిన్య నది పునరుద్ధరణ పనులు రూ.21.09కోట్లతో పనులకు టెండర్లు ఆహ్వానించి గుత్తేదారులకు అప్పగించారు. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు కేవలం 5-10శాతం పనులకే పరిమితమై పనులు చేపట్టక చేతులెత్తేశారు. జిల్లా అధికారుల నివేదికల ఆధారంగా పనులు చేపట్టాలా..? వద్దా? అనేది రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించాల్సి ఉంది.

కొత్త చెరువుల పనులకు అనుమతులివ్వండి..

కొత్త చెరువుల నిర్మాణ పనుల నిర్వహణకు అనుమతులిస్తే వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తాం. కొత్త చెరువుల ఏర్పాటుకు పెద్దఎత్తున ఆయకట్టుకు సాగునీరు అందుబాటులోకి వస్తోంది. ఎన్టీఆర్ జలాశయం నుంచి మిగులు జలాలు చెరువులకు అనుసంధానం, కుప్పం, నగరి, విజయపురం, కార్వేటినగరం మండలాల్లో కొత్త చెరువుల నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

-విజయకుమార్‌రెడ్డి, ఎస్‌ఈ, జలవనరుల శాఖ

అన్నదాతల శిక్షణకు శ్రీకారం

కూటమి ప్రభుత్వంలో సేవలు ప్రారంభం



కుప్పంలో బంతిపూల తోట పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న రైతు శిక్షణ కేంద్రం అధికారులు, శాస్త్రవేత్తలు

ఈనాడు కథనానికి స్పందన

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: వ్యవసాయంలో పాటించాల్సిన ఆధునాతన విధానాలు, యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు వివరిస్తూ సాగులో అన్నదాతలు అధిక దిగుబడులు సాధించేలా చేయూతనివ్వాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన రైతు శిక్షణ కేంద్రానికి వైకాపా హయాం తర్వాత మోక్షం లభించింది. నిధులు కేటాయించకపోవడంతో వైకాపా పాలనలో శిక్షణ కార్యక్రమాలు నిలిచిపోయాయి. దీనిపై 'ఈనాడు'లో ఆగస్టు 9న 'సేవలు.. అవెక్కడ..?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. జిల్లాలో ఈ కేంద్రానికి రూ.6 లక్షల నిధులు కేటాయించడంతో మళ్లీ సేవలు ప్రారంభమయ్యాయి.

సాగు పద్ధతులపై అవగాహన..

రైతు శిక్షణ కేంద్రం ద్వారా రైతులకు అందాల్సిన సేవలను ఇప్పటికే ప్రారంభించాం. క్షేత్రస్థాయికెళ్లి పంటల సాగులో ఎదురయ్యే సమస్యలను రైతులకు వివరిస్తున్నాం. ఉద్యాన, వ్యవసాయ పంటల్లో నూతన పద్ధతులు, కొత్త వంగడాల విస్తరణ, తెగుళ్ల నివారణపై శిక్షణ ఇస్తున్నాం.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

చేపట్టనున్న కార్యక్రమాలు..

రైతు శిక్షణ కేంద్రం ద్వారా మూడు రకాల కార్యక్రమాలు ఉంటాయి. గ్రామాలకు వెళ్లి అధిక ఆదాయ ప్రధాన పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించాలి. ఇలా నెలకు 20-25 వరకు చేపట్టాలి. కొత్తగా వచ్చే వ్యవసాయ పద్ధతులు, ఆధునిక విధానాలు, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి. ఇలాంటి కార్యక్రమాలు 4-6 నిర్వహించాలి. జిల్లాలో సాగుచేసే పంటలను ఆశించే తెగుళ్లు, చీడపురుగులను గుర్తించాలి. సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు శాస్త్రవేత్తలతో కలిసి వెళ్లి పరిశీలించాలి. సమస్య పరిష్కారానికి సూచనలు, తెగుళ్ల నివారణ చర్యలపై ప్రతి నెలా 15-20 పంటల క్షేత్రాలు పరిశీలించి సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

భక్తితో తరించి.. సర్వం సమర్పించి

1150 వరకు శాసనాల్లో శ్రీవారి విశేషాలు



తిరుమల, తిరుపతిలో పలు గోడలపై రాసిన శాసనాలు

ఈనాడు డిజిటల్, తిరుపతి: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి నిత్య కైంకర్యాలకు నెయ్యి వినియోగం శతాబ్దాలుగా కొనసాగుతోంది. స్వామివారి పూజా కార్యక్రమాల్లో నైవేద్యాలకు అత్యంత విశిష్టత ఉంది. వాటి తయారీ, ఇతర సేవల గురించి శాసనాల్లో ప్రస్తావన ఉంది. 1150 వరకు ఉన్న శాసనాల్లో అధికశాతం తిరుమల, తిరుపతిలోని ఆలయ ప్రాకారంపై కనిపిస్తాయి. అవన్నీ 8 నుంచి 18వ శతాబ్ద కాలానికి చెందినవే.

పల్లవ, చోళ, పాండ్య, కడవరాయలు, యాదవరాయలు, విజయనగర రాజులు, మంత్రులు, సామంతులు స్వామిని ఎంతో భక్తితో సేవించి తరించారు. పెద్దఎత్తున విరాళాలు సమర్పించారు. ఆ వివరాలు శాసనాల్లో పొందుపరిచారు. స్వామివారికి చెందిన భూముల్లో పండించే పంటలను పండగలు, బ్రహ్మోత్సవాల సందర్భంగా నైవేద్యాలు తయారు చేసేందుకు వినియోగించేవారు. ఆ సందర్భంలో పాటించాల్సిన నియమాలు, సంప్రదాయాలు, వంటగది నాణ్యత, కొలతలకు సంబంధించిన వివరాలను కూలంకుషంగా ప్రస్తావించారు.

నైవేద్యానికి పెద్దఎత్తున విరాళాలు..

పల్లవ వంశానికి చెందిన కడవన్ పెరుందేవి అనే రాణి శ్రీవారికి ఆహార నైవేద్యాలు అందించేందుకు అవసరమైన భూమి కొనుగోలు నిమిత్తం 4,176 బంగారు నాణేలు విరాళంగా అందించారు. ఇలా అనేకమంది రాజులు 18వ శతాబ్దం వరకు పెద్దఎత్తున విరాళాలు సమర్పిస్తూ వచ్చారు. విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు సామాన్య శకం 1509 నుంచి 1529 వరకు ఏడుసార్లు తిరుమలను సందర్శించారు. ఆయన తన సతీమణులు తిరుమలదేవి, చిన్నాదేవిలతో కలిసి వజ్ర వైడూర్యాలు సమర్పించారు. నైవేద్యాల సమర్పణకు బంగారు పాత్రలు బహూకరించారు.

● 1019లో తిరుమల మొదటి ప్రాకారంలోని ఉత్తర గోడపై ఉన్న శాసనం రాజేంద్ర చోళుడు-1 తమిళంలో వేయించారు. ఇందులో నెయ్యి తరలింపు, స్వామివారి సేవకు వినియోగించే విధానం గురించి ప్రస్తావించారు. స్వామివారికి 24 నేతి దీపాలు వెలిగించే వారని వెల్లడవుతోంది. అప్పట్లో 'తిరువేంగట దేవర్'గా కొలిచిన శ్రీవారికి నిత్య సేవలు జరిగేవి. వాటిని సక్రమంగా చేపట్టడం లేదని గుర్తించి విచారణ అనంతరం వారి ఆధీనంలో ఉన్న నెయ్యి, నిధులను దేవాలయ భాండాగారానికి ఇవ్వాల్సిందిగా ఆదేశించడంతోపాటు దేవాదాయాధికారులు దీపారాధన చేయాల్సిందిగా స్పష్టం చేసినట్లు వెల్లడవుతోంది.

రాష్ట్రస్థాయి క్రీడల్లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన జిల్లా ఉపాధ్యాయులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: యూటీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని ఆ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ ఆదివారం తెలిపారు. గుంటూరులో శుక్ర, శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయిలో 22 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు వీటిలో ప్రతిభ కనబరిచారన్నారు. వాలీబాల్ పోటీలో క్రీడాకారులు బాలాజీ, సిరాజ్, వేణుగోపాల్, లక్ష్మయ్య, బాలాజీ, అంజిబాబు ఉత్తమ ప్రదర్శనతో జిల్లాకు బంగారు పతకం సాధించారని చెప్పారు. 200మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 100మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దేవేంద్ర సాధించారన్నారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో వి.కోట ఉపాధ్యాయుడు గజేంద్ర కాంస్య పతకం సాధించారని చెప్పారు. విజేతలకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్ పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారని పేర్కొన్నారు.

రాజరాజేశ్వరీదేవిగా మరగదాంబిక

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ మరగదాంబిక సమేత శ్రీ మణికంఠేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం రాత్రి అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించి, భక్తులు సామూహిక కుంకుమార్చన చేశారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: వజ్రాలపురం బోయకొండ గంగమ్మ లలిత త్రిపురసుందరీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఉభయదారులుగా కరిడివారిపల్లెకు చెందిన మాజీ సర్పంచి వేణుగోపాల్‌రెడ్డి వ్యవహరించారు. ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, రాజేంద్ర నాయుడు, మేనేజర్ మొగిలప్ప పర్యవేక్షించారు.



బంగారుపాళ్యం: లలితత్రిపుర సుందరీ దేవీ అలంకరణలో వజ్రాలపురం బోయకొండ గంగమ్మ



కాణిపాకం: కంభాదేవి అలంకారంలో మరగదాంబిక..

గణనాథుడి సేవలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మనోజ్‌కుమార్ గుప్తా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఇన్‌స్పెక్టర్ సురేశ్, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. చిత్తూరు న్యాయస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



జస్టిస్ మనోజ్‌కుమార్ గుప్తాకు జ్ఞాపిక అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ సురేశ్

ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే బాలిక హత్య

తల్లీకూతురితోపాటు ఓ బాలుడి అరెస్టు ◆ అస్వియా హత్య కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ కలెక్టర్

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే పుంగనూరులో బాలిక అస్వియా (7) హత్య జరిగిందని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. ఏడు రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరదించినట్లు తెలిపారు. నిందితులు బాధితుడైన అజ్మతుల్లా ఇంటికి కేవలం వంద మీటర్ల దూరంలో నివసిస్తున్న తల్లీకుమార్తె, ఓ బాలుడని. వారిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన అస్వియా హత్య కేసు వివరాలను ఆయన కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి సర్కిల్ కార్యాలయంలో ఆదివారం విలేకర్లకు వెల్లడించారు.



మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ, చిత్రంలో కలెక్టర్ సుమిత్ కుమార్, డీఎస్పీ, వైద్యాధికారి

అభ్యంతరకరంగా మాట్లాడటంతోనే..

'అస్వియా తండ్రి అజ్మతుల్లా వడ్డీ వ్యాపారి. తన వద్ద నగదు తీసుకుని సమయానికి ఇవ్వని వారిని అసభ్యకరంగా మాట్లాడేవారు. అజ్మతుల్లా ఇంటికి వంద మీటర్ల దూరంలో నివసిస్తున్న హసీనా, ఆమె కుమార్తె రేష్మ ఇంటి నిర్మాణానికి అజ్మతుల్లా వద్ద రూ.3.50 లక్షల నగదు వడ్డీకి తీసుకున్నారు. ఈ మొత్తం గడువుమీరినా ఇవ్వకపోవడంతో ఫోన్ చేసి గట్టిగా మాట్లాడేవారు. దీన్ని వారు అవమానంగా భావించి అతనిపై కక్ష పెంచుకున్నారు. గత నెల 29న అస్వియాను అపహరించారు' అంటూ ఎస్పీ తెలిపారు.

చాక్లెట్, భోజనం పెట్టి.. ముక్కుమూసి హత్య

'నిందితురాలు రేష్మ బురఖా ధరించి బాలికకు చాక్లెట్ ఇచ్చి ఇంటికి తీసుకెళ్లారు. అస్వియాకు భోజనం పెట్టారు. కొద్దిసేపటికే బాలిక ఇంటికి వెళ్లాలని ఏడ్చింది. ఎంత సముదాయించినా వినలేదు. ఏడుపు బయటకు వినిపిస్తే ఇబ్బంది అవుతుందనే అనుమానంతో ఓ బాలుడిని కాపలా పెట్టి నిందితులు బాలిక ముక్కు, నోరు మూయడంతో శ్వాస అందక మృతి చెందింది'. 'ఆ సమయంలో బాలిక పెనుగులాడిందని.. రేష్మను బాలిక చేతి గోర్లతో రక్కిన గుర్తులున్నాయి. మృతదేహాన్ని రేష్మకు తమ్ముడి వరసయ్యే బాలుడి సాయంతో ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో విసిరేశారు' అంటూ ఎస్పీ వివరించారు. సమావేశంలో డీఎస్పీలు సాయినాథ్, ప్రభాకర్, సీఐలు శ్రీనివాసులు, సీఐ భాస్కర్ పాల్గొన్నారు.

అత్యుత్సాహం తగదు: కలెక్టర్

కొన్ని పత్రికలు, టీవీలు ఈ కేసును హత్యాచారంగా చూపుతూ ప్రచారం చేశాయని.. మొత్తంగా బాలిక హత్య ఘటనపై అత్యుత్సాహం చూపారని కలెక్టర్ సుమిత్‌కుమార్ అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇలా ప్రవర్తించిన మీడియాపై ఎందుకు కేసులు నమోదు చేయకూడదని ప్రశ్నించారు. వాస్తవాలు చూపించాలే తప్ప వక్రీకరించడం భావ్యం కాదని హితవు పలికారు.

◆ అస్వియా పోస్టుమార్టం నివేదికలో హత్యాచారం జరగలేదని తేలిందని పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి మధుసూదనాచారి తెలిపారు. శరీరంలో ఎక్కడా గాయాలు, అనుమానం వచ్చే ఆనవాళ్లు లేవన్నారు. దీనిపై ల్యాబ్ రిపోర్టు వచ్చిన అనంతరం తుది నివేదిక వెల్లడిస్తామన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	241
లేయర్ మాంసం	187

రాత్రింబవళ్లు శ్రమించి.. కేసును ఛేదించి

◆ అస్వియా హత్యోదంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు
◆ సాంకేతికత ఆధారంగా నిందితుల గుర్తింపు

ఈనాడు, చిత్తూరు; న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ: పుంగనూరు పట్టణంలోని ఏడేళ్ల చిన్నారి అస్వియా హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. సెప్టెంబరు 29న రాత్రి 7.30 గంటలకు బాలిక అపహరణకు గురైనప్పటి నుంచీ నిందితులైన హసీనా, రేష్మతోపాటు మరో బాలుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్టోబరు 5 వరకు రాత్రింబవళ్లు తీవ్రంగా శ్రమించారు. ఎస్పీ మణికంఠ ఘటనాస్థలికి వెళ్లి వ్యక్తిగతంగా విచారించడంతోపాటు 12 బృందాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు కేసు పురోగతి తెలుసుకున్నారు. అధిక జనసాంద్రత ఉన్న ఉబేదుల్లా కాంపౌండ్‌లో కేవలం ఆరేడు సీసీ కెమెరాలు మాత్రమే ఉండటం.. వాటి సామర్థ్యం 2 మెగా పిక్సల్ కావడంతో నిందితులను గుర్తించడం కష్టమైంది. తెలిసిన వ్యక్తులే ఘాతుకానికి పాల్పడ్డారనే అంచనాకు వచ్చినా ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. చివరకు టవర్‌డంప్‌ను విశ్లేషించి ప్రాథమికంగా కొందరిని అనుమానితులుగా భావించి విచారణను ముందుకు తీసుకెళ్లారు. తల్లిదండ్రులు, స్థానికులతో పోలీసులు మాట్లాడిన సందర్భంలో పలువురి తీరుపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ రెండింటిని ఆధారంగా చేసుకుని కొందరిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇవ్వడంతో నిందితుల గుట్టురట్టయింది. దీంతో పోలీసు యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. పట్టణంలో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తుతాయని ఊహించి హత్య చేసిన, సహకరించిన ముగ్గురినీ పుంగనూరుకు తీసుకురాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూశారు.



జాగిలంతో గాలిస్తున్న పోలీసులు (పాతచిత్రం)

రాజకీయం చేసేందుకు వైకాపా నేతల యత్నాలు

సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 2వ తేదీ ఉదయం వరకు బాలిక ఆచూకీ కనుగొనేందుకు పోలీసు బృందాలు పట్టణాన్ని జల్లెడ పట్టినా ఫలితం లేకుండా పోయింది. అస్వియా మృతదేహం లభించిన తర్వాత నిందితులు ఎవరనే అంశంపై ఈనెల 5 వరకు వేట కొనసాగించింది. ఇదే సమయంలో ప్రతిపక్ష వైకాపా నేతలు ఈ ఘటనను రాజకీయం చేసేందుకు యత్నించారు. జిల్లాకు సంబంధం లేని శాసనసభ్యుడు ఓ అడుగు ముందుకేసి పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూసినా సంయమనం కోల్పోలేదు. పోలీసులు ఈ విషయంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శలు చేసి మనోస్థైర్యం దెబ్బతీయాలని చూశారు. ఈ నెల 9న మాజీ ముఖ్యమంత్రి జగన్ పుంగనూరు వస్తారని ప్రకటనలు ఇచ్చి మరింత ఒత్తిడిలోకి నెట్టారు. పోలీసులు పకడ్బందీగా విచారించి ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత ప్రశంసలు అందుకున్నారు.

కీలకంగా వ్యవహరించిన ఎస్బీ, క్రైమ్ విభాగాలు

నిందితులను గుర్తించడంలో స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ), క్రైమ్ పార్టీ, సాంకేతిక బృందాలు కీలకంగా వ్యవహరించాయి. ఎందుకు వారు ఇంత ఘాతుకానికి పాల్పడ్డారు? ఏవిధంగా హత్య చేశారు? ఆ తర్వాత మూడున్నర కిలోమీటర్ల దూరంలోని ఎస్ఎస్ ట్యాంకు వద్దకు ఎలా తీసుకెళ్లారో తెలుసుకునేందుకు స్థానిక పోలీసులు తమదైన శైలిలో విచారించారు. మరోవైపు నిందితుల్లో ఒకరు పదే పదే బాలుడికి ఫోన్ చేశారు. అన్నిసార్లు ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని ప్రశ్నించగా బాలిక దొరికిందా? లేదా? అని తెలుసుకోవడానికే ఆ విధంగా చేశానని బదులిచ్చి పోలీసులకే షాక్ ఇవ్వాలని చూశారు.

అన్నప్రసాదిని.. అభయప్రదాయిని

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: భిక్షాందేహి కృపావలంబన కరీ మాతా అన్నపూర్ణేశ్వరీ అనే అమ్మవారి నామాలతో ఆలయం మార్మోగింది. దసరా మహోత్సవాల సందర్భంగా మూడో రోజు బోయకొండ గంగమ్మ ఆదివారం అన్నపూర్ణా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



నేడు చిత్తూరులో ప్రజా ఫిర్యాదుల వేదిక

చిత్తూరు కలెక్టరేట్, క్రైమ్, న్యూస్‌టుడే: చిత్తూరులోని ఏఆర్ కార్యాలయం, కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ ఆదివారం తెలిపారు.

కొడుకుపై ప్రేమతో జీవితాలు త్యాగం

అంత్యక్రియలు ముగించి వస్తుండగా దినేష్ మృతివార్త

బెట్టింగ్ వ్యసనానికి కుటుంబం మొత్తం బలి

జీడీ నెల్లూరు, న్యూస్‌టుడే: బెట్టింగ్ వ్యసనానికి మరో నిండు కుటుంబం బలైంది. రెండ్రోజుల క్రితం పురుగుల మందు తాగిన జీడీనెల్లూరుకు చెందిన నాగరాజులరెడ్డి, జయంతి, సునీత శనివారానికి మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే ఘటనలో ఇదే కుటుంబానికి చెందిన దినేష్(22) ఆదివారం మరణించారు. దీంతో మొత్తం నలుగురు మృత్యువాత పడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోని నలుగురు సభ్యులు పురుగుల మందు తాగగా, రాత్రి నాగరాజులరెడ్డి, శనివారం మధ్యాహ్నం జయంతి, రాత్రి సునీత, ఆదివారం సాయంత్రం దినేష్ మృత్యువాత పడటం గ్రామస్థులను తీవ్రంగా కలచివేసింది. ఆదివారం చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో ముగ్గురి మృతదేహాలకు శవపరీక్షల అనంతరం మధ్యాహ్నం గ్రామానికి తీసుకొచ్చారు. తరలివచ్చిన బంధువుల అశ్రునయనాల నడుమ.. సాయంత్రం ముగ్గురి అంత్యక్రియలు ముగించి ఇంటికి వస్తున్నారు.

ఈ సమయంలో వేలూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దినేష్ కూడా మృతి చెందినట్లు సమాచారం అందడంతో బంధుమిత్రులు హతాశులయ్యారు. వేలూరు నుంచి సోమవారం ఉదయం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి దినేష్ మృతదేహాన్ని తీసుకొచ్చి.. ఆపై పరీక్షల అనంతరం గ్రామానికి తీసుకురానున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

గతంలో జీడీనెల్లూరులో దుకాణం నిర్వహిస్తూ మండల వ్యాప్తంగా అందరితో కలివిడిగా ఉన్న నాగరాజులరెడ్డి, భార్య, కుమార్తె మృతదేహాలు చేసేందుకు గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు. ఆపై మూడు మృతదేహాలకు ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబంలో చనిపోయిన తండ్రి, తల్లి, అక్కకు.. అన్న కుమారుడు మౌనీష్ తలకొరివి పెట్టాడు.



నాగరాజులరెడ్డి, జయంతి, సునీత మృతదేహాల వద్ద బంధువులు




దినేష్ (పాత చిత్రం)

కొడుకుపై అవ్యాజ ప్రేమ..

డిగ్రీ చదివిన కుమారుడు దినేష్ బెట్టింగ్ వ్యసనానికి బానిస కావడంతో కుటుంబం మొత్తం బలైంది. తండ్రి అనారోగ్యం కారణంగా చేస్తున్న చిన్నపాటి వ్యాపారం, ప్రైవేటు ఉద్యోగం ఆపివేసి, ఇంటి స్థలాన్ని అమ్మేసి ఆ నగదుతో వ్యాపారం లేదా వ్యసనాలకు దినేష్ లోనవకుండా ఉంటే ఆ కుటుంబం పరిస్థితి మరోలాఉండేది. ఆ యువకుడు ఆన్‌లైన్, ఐపీఎల్ బెట్టింగ్‌లో విచ్చలవిడిగా పాల్గొని ఉన్న నగదు పోగొట్టుకోవడంతో పాటు రూ.లక్షల్లో అప్పు చేశాడు. కుమారుడిపై విపరీతమైన ప్రేమ ఉన్న తండ్రి.. అతడు చేసిన అప్పులకు తాళలేక.. విధిలేని పరిస్థితుల్లో కుటుంబీకులు అందరూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం గ్రామస్థులను కలచివేసింది.

అనుమానాస్పద స్థితిలో గురుకుల ఉపాధ్యాయుడి మృతి



ఏసెఫ్ (పాతచిత్రం)

రామకుప్పం: గురుకుల పాఠశాలలో తాను నివసిస్తున్న గృహంలోనే ఓ ఉపాధ్యాయుడి మృతదేహం కుళ్లిన స్థితిలో లభించింది. ఈ ఘటన స్థానిక గురుకుల పాఠశాలలో ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. నంద్యాల జిల్లా నందికొట్కూరు ఆర్‌సీనగర్‌కు చెందిన ఏసెఫ్ (53) గురుకుల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠశాలకు ఈ నెల 2 నుంచి దసరా సెలవులు ప్రకటించారు. అదే రోజు సాయంత్రం అనారోగ్యంతో ఏసెఫ్ స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తీసుకున్నారు. అనంతరం తనకు కేటాయించిన గదిలోకి వెళ్లారు. ఆదివారం పాఠశాల ఆవరణలో దుర్వాసన వస్తుండటంతో భద్రతా సిబ్బంది ఆ గదిని పరిశీలించగా కుళ్లినస్థితిలో మృతదేహం కనిపించింది. పోలీసులు తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు రాళ్లబూదుగూరు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

తెదేపా జిల్లా కార్యాలయాన్ని నిర్మించండి

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: తెదేపా జిల్లా నూతన కార్యాలయాన్ని అన్ని వసతులతో నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు.. జిల్లా పార్టీ నాయకులకు సూచించారు. మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, పార్టీ చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సి.ఆర్ రాజన్ శనివారం తిరుమలలో సీఎంను కలిశారు. చిత్తూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థల పత్రాలను చంద్రబాబు చేతుల మీదుగా వారు అందుకున్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి నాయకులు, కార్యకర్తల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని త్వరగా కార్యాలయ నిర్మాణాన్ని పూర్తిచేయాలని వారికి ఆయన దిశానిర్దేశం చేశారు. నూతన కార్యాలయ నమూనా పరిశీలించారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక.. పలమనేరు: గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలో పాల్గొనే చిత్తూరు జిల్లా సీనియర్ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘ అధ్యక్షులు హేమంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఎంపిక నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల్లో ప్రతిభ చూపిన 18 మందిని ఎంపిక చేశామన్నారు.

తొలగిన చెత్త

ఆనంబట్టు రోడ్డులో చెత్త తొలగించాలని స్థానికుల సమాచారంతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తమ సిబ్బందితో చెత్త తొలగింపజేశారు.
-న్యూస్‌టుడే, పుత్తూరు

స్పందనకు వందనం

వ్యర్థాలు..

పచ్చికాపల్లంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండటంపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడు' శుక్రవారం ప్రచురితమైన సమస్యపై అధికారులు స్పందించారు. పంచాయతీ పాలకులు శనివారం పారిశుద్ధ్య కార్మికులతో చెత్తకుప్పలు తొలగింపజేశారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో చెత్త తొలగింపుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, వెదురుకుప్పం**


గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

విద్యార్థులు ప్రయోజకులైనప్పుడే గురువులకు ఆనందం

కార్వేటినగరం, న్యూస్‌టుడే: విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులైనప్పుడే గురువులకు నిజమైన ఆనందం లభిస్తుందని విశ్రాంత ప్రధానాచార్యులు చంద్రశేఖర్ అన్నారు. డైట్‌లో 1982-83లో చదివిన విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం పూర్వ విద్యార్థులు అలనాటి గురువులను ఘనంగా సత్కరించారు. అధ్యాపకులు సురేష్‌బాబు, చంద్రశేఖర్, ఉమాశంకర్, శాంతకుమారి పాల్గొన్నారు.

రహదారి పక్కన కూరగాయల విక్రయాలు నిరోధించండి

రైతుబజారు దుకాణదారుల వినతి


రైతుబజారులో పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలోని పలు రహదారుల వెంట కూరగాయల విక్రయ దుకాణాల వల్ల రైతు బజారుకు వినియోగదారులు రావడం లేదని.. ఈ విక్రయాలు నిలిపివేయాలని రైతుబజారు దుకాణదారులు.. అధికారులకు విన్నవించారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పరమేశ్వరన్ తేదీ.. ఆ శాఖ విజిలెన్స్ అధికారి బృందం ఆదివారం రైతుబజారును పరిశీలించింది. ఇక్కడికి పెద్దసంఖ్యలో వినియోగదారులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, రహదారుల పక్కన కూరగాయల విక్రయాలు నిరోధిస్తేనే దీనికి పూర్వవైభవం వస్తుందని, లేకుంటే తాము ఆర్థికంగా నష్టపోతామని వారు వాపోయారు. ఈ అంశాన్ని ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడీ మాట్లాడుతూ జిల్లా అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తామన్నారు. త్వరలో రూ.10 లక్షలతో రైతుబజారులో విద్యుదీకరణ, మౌలిక వసతులు కల్పించనున్నామన్నారు. వినియోగదారులకు తక్కువ ధరకు నాణ్యమైన కూరగాయలు అందజేసే రైతుబజారు అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. విజిలెన్స్ బృంద సభ్యులు ఇందుమతి, సంజీవకుమార్, రైతుబజారు సిబ్బంది దేవి పాల్గొన్నారు.

'పుంగనూరు ఘటనలో దోషులను శిక్షించాలి'

నగరి, న్యూస్‌టుడే: పుంగనూరులో చిన్నారి కిడ్నాప్, హత్య కేసులో దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వైకాపా అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్.కె.రోజా ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనిచేస్తోందా? అనే సందేహం కలుగుతోందన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 9న పుంగనూరు వస్తున్నారని తెలిసి, హోంమంత్రి పరుగులు తీశారన్నారు. ఇప్పటికైనా దిశ చట్టాన్ని మహిళల రక్షణ కోసం బలోపేతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

గోవింద భక్తులకు అన్నదానం

వడమాలపేట: తమిళనాడు నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తులకు తడుకు ఆర్ఎస్ఎస్ వద్ద బాలాజీ అన్నదానం ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించి భక్తులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీధర్‌రాజు, భాస్కర్‌రెడ్డి, చినబాబు, అమ్ములు, రాజేంద్ర రాజు, దామోదరంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలిసి కదిలారు..

• ప్రమాదాల నివారణ దిశగా • మొగిలి ఘాట్‌రోడ్డులో చర్యలు

❖ మొగిలి ఘాట్‌రోడ్డులో గత నెల 13న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు.

❖ గత నెల 26న ఇదే మార్గంలో ముందు వెళ్తున్న లారీ.. మరో లారీని ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందగా ఆ లారీ కాలి బూడిదైంది.

❖ ఆపై రెండ్రోజులకు అంటే అదే నెల 28న ఓ లారీ అదుపు తప్పి ఓ మహిళను ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా లారీ రహదారిపై బోల్తా పడింది. ఇలా ఈ మార్గంలో తరచూ పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

❖ శుక్రవారం(నాలుగో తేదీ) ఓ లారీ అతివేగంతో వస్తూ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గుట్టను ఢీకొట్టి నిలిచింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

❖ తాజాగా శనివారం సాయంత్రం నాలుగు వాహనాలు ఇక్కడే వరుసగా ఢీకొనడం గమనార్హం.

న్యూస్‌టుడే, బంగారుపాళ్యం, చిత్తూరు(క్రైమ్)

చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారిపై మొగిలి ఘాట్‌రోడ్డులో ఇటీవల తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది.. గత నెలలో వరుసగా మూడు ప్రమాదాలు జరగ్గా.. ఈ నెలలో తాజాగా శుక్ర, శనివారాల్లో రెండు ప్రమాదాలు తప్పాయి.. దీనికితోడు ఆయా ప్రమాదాల్లో మృతుల సంఖ్య సహా క్షతగాత్రుల సంఖ్య పెరుగుతుండటంతో జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది.. కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ.. రవాణా, పోలీసు, నేషనల్ హైవే అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.. ఎప్పటికప్పుడు ప్రమాదాల నివారణ చర్యలపై సమీక్షిస్తున్నారు.


ఘాట్‌రోడ్డులో వేగ నిరోధకాలు నిర్మించి వాటికి వేసిన తెల్ల రంగు


వాహనదారులను అప్రమత్తం చేస్తూ ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్ చిత్రం

వేగ నిరోధకాల ఏర్పాటు..

మొగిలి ఘాట్‌రోడ్డులో తాజాగా ప్రమాదాల సంఖ్య పెరిగింది. భారీగా ప్రాణ నష్టం చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో.. జిల్లా రవాణాశాఖ అధికారి సునీల్‌కుమార్, బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు, హైవే అధికారులు.. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలు సహా జరిగిన ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ఇప్పటికే వారి వద్ద ప్రమాదాలు జరిగే ప్రాంతాల వివరాలు కొన్ని ఉన్నాయి. వీటితోపాటు.. మరికొన్ని బ్లాక్‌స్పాట్‌లను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. ముఖ్యంగా దొరచెరువు ప్రాంతం నుంచి ఘట్ రోడ్డులోని శ్రీ ఫుడ్‌పార్కు వరకు సుమారు కిలోమీటరు దూరం మేర రహదారిపై డ్రమ్ములు ఏర్పాటు చేశారు. ప్రమాదాన్ని సూచించే ఎరుపు, తెలుపు రేడియం స్టిక్కర్లు అతికించారు. సుచిక బోర్డులకు జై ఆంజనేయ స్వామి చిత్రంతో ఉన్న ఆరంజి రంగు జెండాలు కట్టారు. దొరచెరువు మలుపునకు ముందు రహదారిపై వేగ నిరోధకాలు ఏర్పాటు చేశారు. వాటికి తెలుపు రంగు వేశారు. దీంతో వాహన చోదకులు వేగాన్ని తగ్గించి నెమ్మదిగా ఘాట్ రోడ్డు దిగుతారని అంచనా. ఫలితంగా ఇక్కడ ప్రమాదాలు నివారించవచ్చనేదీ అధికారుల ఆలోచన. ఇవన్నీ గత మూడ్రోజులుగా యుద్ధప్రాతిపదికన పూర్తిచేశారు.

అప్రమత్తం చేస్తున్నాం..



ఘాట్‌రోడ్డులో ప్రమాదాల నివారణే లక్ష్యంగా సర్వశక్తులూ ఒడ్డుతున్నాం. రాత్రింబవళ్లు పోలీసులకు ఘాట్ రోడ్డులో డ్యూటీలు వేసి వాహనదారులను అప్రమత్తం చేస్తున్నాం. నిత్యం స్పీడ్ గన్ వాహనాన్ని(ఇంట్రా సెప్టార్) రహదారిపైనే ఉంచి అతి వేగంగా వెళ్తున్న వాహనదారులకు జరిమానా విధిస్తున్నాం. కలెక్టర్, ఎస్పీ, పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ సలహాలు, సూచనలతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాం.
-శ్రీనివాసులు, సీఐ, బంగారుపాళ్యం


● కలెక్టరేట్: గిరింపేట దుర్గాంబ దేవస్థానంలో పార్వతీదేవి అలంకరణ ● సంతపేట: కట్టమంచి సాయిబాబా మందిరంలో లలితా త్రిపురసుందరీ అలంకరణ ● చిత్తూరు క్రీడలు: అంకాళ పరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణ

పార్వతీదేవీ.. పాహిమాం

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలోని అమ్మవారి ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా సాగాయి. గిరింపేటలోని దుర్గాంబ దేవస్థానంలో అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తుల్ని అనుగ్రహించారు. దేవస్థానం మాజీ ఛైర్మన్, తెదేపా నాయకులు వీకే విశ్వనాథ్, ప్రస్తుత ఛైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈవో మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు. చిత్తూరు గ్రామీణ: బీఎన్ఆర్‌పేట కోదండరామస్వామి ఆలయంలో సీతాసమేతంగా శ్రీరామలక్ష్మణులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు బాలాజీ శ్రీనివాసన్ స్వామి, అమ్మవార్లకు ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


● నగరి: మహేశ్వరి అవతారంలో కామాక్షీదేవి ● నగరి: ప్రత్యేక అలంకరణలో మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి ● పుత్తూరు: వైష్ణవీదేవి అలంకరణలో నాగాలమ్మ ● కార్వేటినగరం...అన్నపూర్ణాదేవి అలంకరణలో బంగారమ్మ


కలెక్టరేట్: దుర్గాంబ దేవస్థానంలో మాజీ ఛైర్మన్ వీకే విశ్వనాథ్, పాలకవర్గ సభ్యులు

ప్రతిభగల ఆటగాళ్లను వెలికితీస్తాం.. చిత్తూరు(క్రీడలు): చెస్‌లో ప్రతిభగల ఆటగాళ్లను వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తామని ఏపీ చెస్ అసోసియేషన్(ఏపీసీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్ అన్నారు. ఏపీసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రసాద్ ఎన్నికైన సందర్భంగా ఆదివారం చిత్తూరులోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. చెస్‌లో ఉత్తమ ఆటగాళ్లను ఎంపిక చేసేందుకు త్వరలో శిబిరాల్ని ఏర్పాటు చేసి, పోటీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడిగా జిల్లా వాసి ఎంపికవడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు శ్రీధర్, కాజూరు బాలాజీ, మండీ సుధ, ఆదినారాయణ, బాలు, సోమనాథ్, దినేష్, కిషోర్, సునీల్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక.. వడమాలపేట: రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల రెండు నుంచి 5 వరకు కృష్ణా జిల్లా నున్న జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలలో అండర్-17 గ్రీకో రోమన్ విభాగంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి పూడి శ్రావణ్‌కుమార్(92 కిలోల విభాగం) బంగారు పతకాన్ని, వేలూరు ఉదయ్‌కుమార్ (71 కిలోల) కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారని హెచ్ఎం కరణా నవనీతం, పీడీ చంద్రశేఖర్‌రాజు ఆదివారం తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.


వినాయకుడి దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్
-న్యూస్‌టుడే, కాణిపాకం

అవార్డు రావడం సంతోషం

పుత్తూరు: నియోజకవర్గ మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎస్‌డీ హుస్సేన్‌కు బహుజన సాహిత్య అకాడమీ.. డాక్టర్ అబ్దుల్ కలాం అవార్డు అందజేయడం ఎంతో సంతోషమని ముస్లిం మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో బహుజన సాహిత్య అకాడమీ 8వ నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. షేక్ సందాని, రఫీ అహ్మద్, మొహమ్మద్ గౌస్, సర్దార్, సన్నావుల్లా పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ విజేత చిత్తూరు జట్టు.. ఏలూరు తూర్పువీధి: ఏలూరు ఏఎస్ఆర్ మైదానంలో జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం, సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఆధ్వర్యంలో టి.మోహన్‌కుమార్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. తుది పోరులో రామచంద్రాపురం జట్టుపై చిత్తూరు జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.12 వేలు నగదు బహుమతిని ఏపీ పంచాయతీరాజ్ సెక్రటరీల సంఘం కార్యదర్శి కృష్ణారావు అందజేశారు.

శాస్త్రోక్తంగా నవచండీ హోమం.. చిత్తూరు(సంతపేట): శరన్నవరాత్రుల సందర్భంగా సంతపేటలోని జీజేఎం సుఖీభవ హాల్‌లో నవచండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. హోమ పూజల అనంతరం చండీదేవి ఉత్సవర్లను ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు.

ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు..నగరి: పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో పెల్లకూరు చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు వంశీకృష్ణ, మానస బృందం 200 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 50 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశామని, 40 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. ట్రస్ట్ నిర్వాహకులు గౌరిశంకర్, సీతారామ నాయుడు, కృష్ణ గల్లా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ ప్రారంభం.. చిత్తూరు(సంతపేట): సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో గిరింపేట, చామంతిపురం, ఉషానగర్, కొంగారెడ్డిపల్లె, రామ్‌నగర్ కాలనీ, సంతపేటలోని బాలవికాస్ కేంద్రాల్లో పిల్లల శిక్షణ కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మానవతా విలువలు, సమయపాలన, నీతికథల బోధన, సంగీతం, చిత్రలేఖనంతో పాటు పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు. సంస్థల ప్రతినిధులు మధుసూదనం, శంకర్, శ్రీనివాసన్, దేవరాజు, గజేంద్రరెడ్డి, శేషనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

బంగారుపాళ్యం: నల్లగాంపల్లె దేవకొండపై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామి, అమ్మవార్ల కల్యాణం కనులపండువగా ఆదివారం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవీ అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి మేళతాళాల నడుమ కల్యాణం జరిపించారు. బెంగళూరుకి చెందిన మురళమ్మ, రవి కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సంస్కరణలకు ఆద్యుడు రాజారామ్మోహన్‌రాయ్


పురస్కారాలు అందుకున్న సాహితీవేత్తలు, విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మన దేశంలో సంఘ సంస్కరణలకు ఆద్యుడు విశ్వవిఖ్యాత రాజా రామ్మోహన్‌రాయ్ అని ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. చిత్తూరులోని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం సమాఖ్య వ్యవస్థాపకులు దేవేంద్రరావు అధ్యక్షతన.. రాజా రామ్మోహన్‌రాయ్ సంఘ సంస్కరణలపై సదస్సు నిర్వహించారు. సాహితీవేత్తలు, సామాజిక సేవకులు, విద్యార్థులకు రామ్మోహన్‌రాయ్ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాపకులు దేవేంద్రరావు, రాజన్, మునీంద్ర, చక్రపాణి, గోవిందయ్య, సోము ఉమాపతి, గోవిందన్, కన్నయ్య, భాస్కర్, జ్ఞానశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామలింగస్వామి జయంతి వేడుకలు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: శీర్ కరుణీకర్ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో జ్యోతి రామలింగస్వామి 202వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి రామలింగ స్వామి చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం చదువులో ప్రతిభ కనబరచిన బాల, బాలికలకు ప్రోత్సాహక నగదు బహుమతిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో శీర్ కరుణీకర్ అభ్యుదయ సంఘం ప్రతినిధులు ద్యుమణి, ప్రసాద్ కుమార్, విశ్వేశ్వరపిళ్లై, సుందర మూర్తి, రవి చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.


బాలికకు నగదు బహుమతి అందిస్తున్న సంఘ ప్రతినిధి

9న ఆఖరు గడువు


శిరీషాదేవి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 8 మద్యం దుకాణాలకు ఈ నెల 9వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి ఆదివారం స్థానిక కార్యాలయంలో విలేకరులకు తెలిపారు. కార్వేటినగరంలో 3, వెదురుకుప్పం-2, శ్రీరంగరాజపురం-2, పాలసముద్రం-1 దుకాణాలకు రూ.2లక్షలు చెల్లించాలని పేర్కొన్నారు. 11న చిత్తూరులోని కో-ఆపరేటివ్ సొసైటీ వద్ద లాటరీ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎస్సైలు మోసెస్, శ్రావణ్‌తేజ పాల్గొన్నారు.

చదివిన కళాశాలకు మంచిపేరు తేవాలి


గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్న విద్యార్థిని

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల ఆశయాలకు విద్యాసంస్థలను అభివృద్ధి చేస్తున్నాయని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ ట్రస్ట్ నిర్వాహకురాలు డాక్టర్ డీకే కల్పజ తెలిపారు. స్థానిక శ్రీబాలా త్రిపుర సుందరి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డేలో ఆమె పాల్గొని మాట్లాడారు. జేఎన్‌టీయూఏ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సుదర్శనరావు మాట్లాడుతూ మంచి ఇంజినీరు కావాలంటే నైపుణ్యం ముఖ్యమన్నారు. విద్యార్థి తాను చదివిన కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఇంజినీరింగ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వ్యవస్థాపక ఛైర్మన్ డీకే ఆదికేశవులు, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ డీకే సత్యప్రభ, వైదేహి మెడికల్ కళాశాల పేరిట ముగ్గురు చొప్పున, డాక్టర్ కల్పజ పేరుతో ఇద్దరికి బంగారు పతకాలు, నగదు అందజేశారు. కళాశాల వైస్‌ఛైర్మన్ రంగనాథం, ప్రిన్సిపల్ వెంకటాచలపతి, కార్యదర్శి డీకే బద్రీనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లింలు ఐక్య పోరాటం చేయాలి


గాంధీ విగ్రహ కూడలి వద్ద ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: ముస్లిం సమాజం అభివృద్ధి కోసం అందరూ ఐక్యంగా పోరాటం చేయాలని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ అలీ అన్నారు. ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముస్లిం ఆత్మీయ సమావేశం ఆదివారం స్థానిక ఉర్దూ షాదీఖానాలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరూ సమైక్యతతో పనిచేసినప్పుడే డిమాండ్లను పరిష్కరించుకోగలమని, సమస్యల్ని త్వరలో పాలకుల దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. గాంధీ విగ్రహ కూడలి నుంచి షాదీఖానా వరకూ సమైక్య ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఖలీల్ సయ్యద్, సయ్యద్ నూర్, రషీద్, ఇనయతుల్లా, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

కాల్వలో పడి వృద్ధుడి దుర్మరణం

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: నగరంలోని రామ్‌నగర్ కాలనీ సమీప ఖాదర్‌మీనన్ వీధికి చెందిన ఛాంద్‌బాషా(62) ప్లాస్టిక్ సామాన్లు విక్రయించి జీవిస్తున్నాడు. అతడు ఆదివారం రాత్రి మద్యం సేవించి కాల్వపై కూర్చుని ఉండగా ప్రమాదవశాత్తూ జారి కాలువలో పడి మరణించాడు.

నిమజ్జనానికి వెళ్లి బాలుడు..

చిత్తూరు(నేరవార్తలు): నగరంలోని కట్టమంచి చెరువులో వినాయక నిమజ్జనానికి వెళ్లి ఓ బాలుడు మరణించిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానిక గురప్పనాయుడు కాలనీకి చెందిన ఆకాష్(14) వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు కట్టమంచి చెరువుకు వెళ్లాడు. లోపల నీరున్న ప్రాంతంలో దిగి బురదలో కూరుకుపోయాడు. స్థానికులు గమనించి బయటకు తీసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మరణించాడని వైద్యులు తెలిపారు.

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు



హోం మంత్రి అనితకు వినతి పత్రం అందిస్తున్న ఎస్డీపీఐ నాయకులు

గంజాయి అరికట్టాలని వినతి

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో విచ్చలవిడిగా విక్రయిస్తున్న గంజాయి, నాటుసారా, మెడికల్ షాపుల్లో లభిస్తున్న మత్తు పదార్థాలు అరికట్టాలని సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు జమీర్‌లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి యూసూఫ్ ఆదివారం హోం మంత్రి అనితను కలిసి వినతి పత్రం అందజేశారు. పలు మెడికల్ షాపుల్లో మత్తు మాత్రలు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం.. కుప్పం పట్టణం: నియోజకవర్గ పరిధిలో 10 మద్యం దుకాణాలకు సంబంధించి ఆన్‌లైన్ టెండర్లలో ఆసక్తిగల వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ నాగరాజ, ఎస్సై మోహన్ బాబు తెలిపారు. ఈ నెల 9 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 11న చిత్తూరులో డ్రా నిర్వహించనున్నట్లు వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:

సమస్య: జంబుగుండ్లపల్లె నూతన రక్షిత తాగునీటి సరఫరా ట్యాంకు అలంకారప్రాయంగా మారింది. పాత ట్యాంకు శిథిలావస్థకు చేరింది. పైపులైను కనెక్షన్ ఏర్పాటు చేసి వీధులకు కుళాయిలు అమర్చాలి. **- స్థానికులు**

సమాధానం: వెంటనే పరిశీలించి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం. **- లోకనాథం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ**

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణం కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తాగునీటి పైపులైను పగిలింది. రోజుల తరబడిగా నీరు వృథాగా కాలువలోకి పోతుంది. **- మహేష్, కుప్పం**

సమాధానం: వెంటనే పరిశీలించి మరమ్మతులు చేయించి, నీటి వృథా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసరావు, కమిషనర్, కుప్పం పురపాలిక**

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

పలమనేరు, న్యూస్‌టుడే: గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలో పాల్గొనే చిత్తూరు జిల్లా సీనియర్ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షులు హేమంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారుల్లో ప్రతిభ చూపిన 18 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి గుంటూరులో సీనియర్ బాలుర టోర్నమెంటులో జట్టు పాల్గొంటుందని వివరించారు. సంఘం కార్యదర్శి కిషోర్‌కుమార్ క్రీడాకారులకు సమవస్త్రాలు ఉచితంగా అందించారు. కోచ్‌గా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ విక్రమ్‌రాజ్ వ్యవహరిస్తారు.

దాతల సహకారం అభినందనీయం



వాహనానికి పూజలు చేసి భక్తులతో అమరనాథరెడ్డి

పలమనేరు, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానానికి పలమనేరు నుంచి కూరగాయలు పంపుతున్న దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణానికి చెందిన దాతలు 3 ప్రత్యేక వాహనాల్లో కూరగాయలు దేవస్థానానికి పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాహనాలకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ ప్రాంతం నుంచి గత 14 సంవత్సరాలుగా భక్తులు దాదాపు 340 లోడ్ల కూరగాయలు పంపిచారని అమరనాథరెడ్డి చెప్పారు. వారిని అభినందించారు. ఆర్వీబాలాజీ, గిరిబాబు, బీఆర్సీకుట్టి, కిరణ్, ఖాజా, చాంద్‌బాషా పాల్గొన్నారు.

క్రీడాకారులు కళకళ.. మైదానాలు వెలవెల



ప్రైవేటు పొలాల్లో వాలీబాల్ ఆడుతున్న యువకులు

మారుమూల గ్రామాల నుంచి రాష్ట్రస్థాయికి ఎంపిక ♦ వసతులు సమకూరిస్తే మరింత ప్రయోజనం

సదుం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి గతంలో కబడ్డీలో రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులున్నారు. ప్రస్తుతం అదే స్థాయిలో వెలుగులోకి వస్తున్నారు. దాంతో పాటు క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, అథ్లెటిక్స్ తదితర క్రీడల నుంచి ఆణిముత్యాలాంటి పిల్లలు వెలుగులోకి వస్తున్నారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో పలువురు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఇంత ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నా.. వారికి సరైన శిక్షణ, సాధన కోసం కనీసం మైదానాలు సమకూర్చలేని దుస్థితి మనది.

శిక్షణ తీసుకుని.. సత్తా చాటుతున్నా.. ప్చ్

సదుంలో కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులు ఉన్నారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా రాణిస్తున్నారు. గతంలో సదుంలో వివిధ స్థాయిలో పోటీలు నిర్వహించేవారు. పలువురు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పుంగనూరుకు పేరు తీసుకువచ్చారు. ప్రతి రోజు పదుల సంఖ్యలో స్థానిక పోలీసు క్రీడామైదానంలో ఆడుతున్నారు. గతంలో ఈ స్థలంలో చుడా నిధులతో పార్కు ఏర్పాటు చేయడంతో మైదానాన్ని తిరిగి నిర్మించుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేలా 2018 నుంచి సీనియర్ కబడ్డీ క్రీడాకారులు శ్రీనివాసులు, గుల్జార్ ఆధ్వర్యంలో యువతి, యువకులకు శిక్షణ ఇస్తున్నారు. వీరు పతకాలు సాధిండం విశేషం.

గతంలో పూర్తిగా విస్మరణ..

ప్రస్తుతం బ్యాడ్మింటన్ క్రీడాకారులు వందల సంఖ్యలో ఉన్నారు. వీరిలో నైపుణ్యం పెంచితే చాలా మంది వివిధ స్థాయిల్లో రాణిస్తారు. వారికి కనీసం మైదానం, ఇండోర్ స్టేడియం అందుబాటులో లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. అరకొర వసతుల మధ్యే తమకిష్టమైన ఆటల్లో ప్రావీణ్యం సాధించేందుకు నిరంతరం సాధన చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వం 5 ఏళ్ల పాలనలో క్రీడారంగాన్ని నిర్వీర్యం చేసింది. క్రీడలపై ఆసక్తి ఉన్న యువత రెక్కలు విరిచేసింది. వైకాపా ప్రభుత్వ హయంలో పుంగనూరులో మినీ స్టేడియానికి స్థలం ఎంపిక చేసిన తర్వాత వేర్వేరు కారణాలతో నిర్మాణపనులు జరగలేదు.

వాలీబాల్‌కు సరైన స్థలం లేక పొలాల్లో

వాలీబాల్‌కు సంబంధించి మూడు దశాబ్దాలుగా సదుంలో క్రీడాకారులు ఉన్నారు. 1995లో విశ్రాంత ప్రిన్సిపల్ అల్లాఉద్దీన్, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి గౌస్‌పీర్ ఆధ్వర్యంలో వాలీబాల్ సాధన ప్రారంభించారు. అప్పట్నుంచి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో పదుల సంఖ్యలో యువకులు వాలీబాల్ ఆడుతుంటారు. వివిధ పట్టణాల్లో జరిగే టోర్నమెంట్లలో పాల్గొంటూ రాణిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా క్రీడామైదానాలు లేక పొలాల్లో ఆడుతున్నాయి.

ఇండోర్ స్టేడియం నిర్మించాలి



చిన్నతనం నుంచే కబడ్డీ ఆడుతున్నాం. సదుంలో జిల్లా, రాష్ట్ర, యూనివర్శిటీ స్థాయిలో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడకారులు ఉన్నారు. ప్రభుత్వమే ఇండోర్ స్టేడియాన్ని నిర్మించాలి. ప్రోత్సహిస్తే జాతీయస్థాయిలోకి వెళ్లేందుకు అవకాశాలు ఉంటాయి.

– శ్రీనివాసులు, కబడ్డీ శిక్షకుడు

వారాంతపు సంతలపై పర్యవేక్షణ

పలమనేరు, న్యూస్‌టుడే: కబేళాలకు తరలుతున్న పశువుల సంరక్షణ కోసం వారాంతపు సంతలపై నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పలమనేరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సుజాత శుక్రవారం తెలిపారు. 'దేశీఆవు కసాయి చేతిలో' శీర్షికన గతనెల 25న కథనం ప్రచురితమైంది. కథనానికి ఆమె స్పందించారు. పశువుల అక్రమ రవాణా విషయాన్ని డీఎస్పీ దృష్టికి తీసుకెళుతున్నట్లు చెప్పారు.

అడవినాథునికుంటలో పారిశుద్ధ్య పనులు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని రాగానిపల్లె పంచాయతీ అడవినాథునికుంటలో ఆదివారం పంచాయతీ కార్యదర్శి సురేంద్రరెడ్డి పారిశుద్ధ్య కార్మికులతో మురుగు కాలువలు, చెత్త దిబ్బలు, వ్యర్థాలు తొలగింపజేశారు. ఇటీవల గ్రామస్థులు.. పారిశుద్ధ్య సమస్యపై ఫిర్యాదు చేయడంతో మేమున్నాం.. మీకుతోడుగాలో వార్త ప్రచురితమైంది. స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టారు.

కాల్వలు ఇలా.. రోగాలు రావా..!



మండల పరిధి పెద్దగొల్లపల్లెలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మురుగు పారుదల వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలా ఉంటే దోమలు ప్రబలి రోగాలు రావా అంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 125 కుటుంబాలు నివాసముంటున్నారు. సీసీ రహదారులు నిర్మించినా.. కాల్వల్లో కనీసం పూడిక తీయకుండా వదిలేశారు. మరికొన్ని చోట్ల కాల్వలు నిర్మించకుండా వదిలేశారు. గ్రామస్థులు పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన లేదు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెద్దగొల్లపల్లె (గుడుపల్లె)

గుంతల దారిలో అవస్థల ప్రయాణం



శ్యారాజపురం బీటీ రహదారి దుస్థితికి చేరుకొంది. కుప్పం-పలమనేరు జాతీయ రహదారి నుంచి బీరనకుప్పం, తిమ్మరాజుపల్లె, వెదురుగుట్టపల్లె, వెంకటేశపురం, శ్యామరాజపురం తదితర గ్రామాలకు 20 ఏళ్ల కిందట నిర్మించిన రోడ్డు మరమ్మతులు కొరవడి.. అధ్వాన స్థితికి చేరుకొంది. రహదారిపై గుంతల్లో వర్షపునీటి మడుగులు ఏర్పడుతున్నాయి. పాదచారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. రోడ్డు మరమ్మతులు కోరుతూ ప్రతిపాదనలు పంపామని ర.భ శాఖ ఏఈ క్రిష్ణానాయక్ తెలిపారు. **- న్యూస్‌టుడే, శాంతిపురం**

ఎండీయూ కష్టాలు తీరేదెన్నడో..!



నిత్యావసరాల కోసం క్యూలో నిలబడాల్సిన కష్టం ప్రజలకు తీరడం లేదు. రేషన్ దుకాణాల్లో పంపిణీ అవుతున్న నిత్యావసరాలను గత వైకాపా ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటికే పంపిణీ చేస్తామంటూ సభల్లో ఊదరగొట్టారు. అయితే క్షేత్ర స్థాయిలో ఎండీయూ వాహనం ఎప్పుడొస్తుందో తెలియక.. ఎక్కడుంటుందో తెలియక రేషన్‌కార్డుదారులు నిత్యం కష్టాలు పడాల్సి వస్తోంది. కుప్పం పట్టణం గాంధీ రోడ్డులో ఆదివారం రోడ్డు పక్కన నిలిపిన ఎండీయూ వాహనం ఎదుట గంటల తరబడి వేచి ఉండి, నిత్యావసరాలను తీసుకోవాల్సి వచ్చింది. అధికారులు తమ కష్టాన్ని తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం**

ప్రమాదాల నివారణకు చెక్‌పాయింట్



పలమనేరు, న్యూస్‌టుడే: మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణకు చెక్ పాయింట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు డీటీసీ నిరంజన్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన సిబ్బందితో జగమర్ల, మొగిలి ఘాట్, గాంధీనగర్ వద్ద నాలుగోనంబరు జాతీయ రహదారిని పరిశీలించారు. రెండు రోజులుగా ప్రమాదాల నివారణ కోసం చేస్తున్న ఏర్పాట్లు చూశారు. డ్రైవర్లు రోడ్డుమీద ఏర్పాటు చేసిన డ్రమ్ములను పడకొట్టేసి వెళ్లడం దురదృష్టకరమన్నారు. కాగా దొరచెరువు వద్ద స్పీడు బ్రేకర్లు వేసినట్లు తెలిపారు. ప్రమాదకర మలుపు వద్ద సైతం త్వరలో వేగ నియంత్రికలు ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ పాయింట్ పెట్టి నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

'అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధం'



లక్కనపల్లెలో శ్రీనివాసులురెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు, అణచివేతలు ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. లక్కనపల్లెలో ఆదివారం మాజీ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. తెదేపానేతపై హత్యాయత్నం కేసులో అరెస్టై బెయిల్‌పై వచ్చారు. జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీపీ రెడ్డెప్ప పాల్గొన్నారు. **పలమనేరు:** మండలంలోని ఎంకోటూరుకు చెందిన వైకాపా మండల కన్వీనర్ బాలాజీనాయుడును పుంగనూరు శాసనసభ్యుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పరామర్శించారు.



పుంగనూరు: అన్నపూర్ణాదేవి అలంకారంలో పార్వతీదేవి ♦ తాటిమాను గంగమ్మ దేవత ♦ వి.కోటలో.. ♦ కల్లూరులో.. ♦ పలమనేరులో.. ♦ కుప్పం: రామచంద్రారోడ్డులో..

నవరాత్రి ఉత్సవం.. నేత్రపర్వం

మూడు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. వెలసిన అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నారు. నాల్గో రోజు ఆదివారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు అభయమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతిమల వద్ద అన్నదానం చేశారు. బైరెడ్డిపల్లె మండలం తీర్థం గ్రామంలో వెలసిన శ్రీరామచంద్రస్వామి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాల్లో ఆదివారం శేష వాహనంపై స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. **- న్యూస్‌టుడే బృందం**



శ్రీరామచంద్రస్వామి.. సోమల: పత్రపల్లెలో ♦ సదుం: పచ్చార్లమాకులపల్లెలో హోమం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: లక్కనపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో 2008-09 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. పాఠశాలలో 15 ఏళ్ల క్రితం చదివిన విద్యార్థులు, ఉపాధ్యాయులు సమావేశమై అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. గురువులను దుశ్శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. **రామకుప్పం:** మండలంలోని చెల్దిగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-2007లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అప్పటి గురువులు సుధాకర్‌రెడ్డి, గుణశేఖర్, ఇర్ఫాన్, రఘు, రవిను ఘనంగా సత్కరించారు.



బైరెడ్డిపల్లె: అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు



మునిరాజాకు నగదు అందిస్తున్న స్నేహితులు

బాల్యమిత్రులకు బాసట

సదుం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న బాల్యమిత్రుడికి పూర్వ విద్యార్థులు బాసటగా నిలిచారు. సదుం బలిజవీధికి చెందిన మునిరాజా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ సమాచారం వాట్సప్‌లో తెలుసుకున్న 1993-94 పదోతరగతి విద్యార్థులు స్పందించి రూ 44,500 నగదు, నిత్యావసరాలు ఆదివారం ఇంటికి వెళ్లి అందించారు. మిత్రుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సోమల: స్థానిక ఉన్నత పాఠశాల 1974-75 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఇటీవల సమావేశమైయ్యారు. ఆర్థిక ఇబ్బందుల్లోని నంజంపేటకు చెందిన రత్నమ్మకు రూ.32వేల నగదును ఆదివారం అందజేశారు.

అస్వియాకు కొవ్వొత్తులతో నివాళి

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలో ఆదివారం మైనారిటీలు, పట్టణ వాసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పుంగనూరు పట్టణానికి చెందిన బాలిక అస్వియా మృతికి వారు సంతాపం తెలిపి కార్యక్రమం చేపట్టారు. నెహ్రూ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నినాదాలు వినిపించారు. కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు.

47 మందికి నేత్ర వైద్య పరీక్షలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 47 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు 47 మందికి నేత్ర పరీక్షలు జరిపి కంటి సమస్యతో బాధపడుతున్న ఐదుగురిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు సురేష్‌బాబు

వి.కోట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చింతమాకుపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం ఓ ప్రైవేట్ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్యులు సురేష్‌బాబు మాట్లాడుతూ 500మందికి పైగా మండల పరిధిలోని రోగులు హాజరైనట్లు తలిపారు. 70మందిని వివిధ ఆరోగ్య సమస్యలతో రెఫరల్ చేసినట్లు తెలిపారు. తెదేపా నాయకులు రంగనాథ్, రాంబాబు, సతీష్, బంగారుబాబు, ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ

సదుం, న్యూస్‌టుడే: మండలంలోని బట్టువారిపల్లె కావమ్మ, మారయ్యల ఆలయం వద్ద మహాభారత యజ్ఞం సందర్భంగా ఆదివారం దుర్యోధనవధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం పాండవుల ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వెంకటేశ్వర నాట్యకళా మండలి కళాకారులు దుర్యోధనవధ ఘట్టాన్ని ప్రదర్శించారు. ఆలయ ఆవరణలో బంకమట్టితో దుర్యోధనుడి బొమ్మను తయారుచేసి పూజలు చేశారు. ధుర్యోధనుడిని భీమసేనుడు మడుగులో నుంచి బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది.

కంభారాయుడి స్తూపానికి ప్రత్యేక పూజలు

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని మంగళంపేట గ్రామానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో సుందర అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి స్తూపానికి గొప్ప చరిత్ర ఉన్న విషయం తెలిసిందే. స్థూపానికి మంగళంపేటకు చెందిన శెట్టోరి వంశస్థులు తిరుమల బ్రహ్మోత్సవ సందర్భంగా పూజలు చేశారు. స్థూపానికి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



చిన్నపాటి భవనంలో కార్యాలయం ♦ కార్యాలయం ఎదుటే నిలిపిన ద్విచక్ర వాహనాలు

ఆదాయంలో భేష్.. భవనం చూస్తే బేజారు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిత్యం క్రయవిక్రయాల కోసం వచ్చే ప్రజలతో కిటకిటలాడుతుంటుంది. కనీసం ప్రజలు కూర్చొడానికి స్థలమూ లేదు. ఎప్పుడో బ్రిటీష్ కాలం నాటి చిన్నపాటి భవనంలోనే కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అయితే ఈ కార్యాలయం ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం రాగా.. ఇటు ఉద్యోగులు, దానిపై ఆధారపడి జీవించే ఏజంట్లకు కూడా పెద్దగానే ఆదాయం సమకూరుతుంది. అయితే పాత భవనం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలనే ఆలోచన అధికారుల్లో రాలేదు. దీంతో కార్యాలయానికి వచ్చేవారు ఆరుబయట ఉండాల్సిందే. ధ్రువపత్రాలు రాసేవారు మాత్రం ప్రహరీ వద్ద రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడికి వచ్చే వారు తమ ద్విచక్రవాహనాలను కార్యాలయం ఎదుట నాలుగోనంబరు జాతీయ రహదారిమీద పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ కార్యాలయం ద్వారా యేటా రూ. 30 కోట్లకు పైగా ఆదాయం ప్రభుత్వానికి చేరుతుంది. భవనం పాతకాలం నాటిదేనని, కొత్త భవనం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని సబ్‌రిజిస్ట్రార్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

గోగులమ్మ వంకలో ఏనుగుల మంద సంచారం



గోగులమ్మ వంక సమీపంలోని గుట్టలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలో నెల రోజులుగా పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు అపార నష్టం చేస్తున్న 16 ఏనుగుల గుంపు ఆదివారం ఉదయం కల్లూరు నుంచి గంటావారిపల్లెకు వెళ్లే ప్రధాన మార్గంలోని గోగులమ్మ వంక సమీపంలో సంచరిస్తూ స్థానికుల కంట పడ్డాయి. 12 పెద్ద ఏనుగులు, నాలుగు గున్న ఏనుగులు గుట్టను ఎక్కుతున్నది వాస్తవమేనని స్థానిక అటవీశాఖ అధికారి శ్రీదేవి తెలిపారు. మండలంలోని బోడ్రెడ్డిగారిపల్లె, చల్లావారిపల్లె పంచాయతీల్లోని పంట పొలాలపై పడ్డాయి.

తెదేపా బ్యానరు తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులు

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: బోయకొండ వద్ద తెదేపా బ్యానరును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. తెదేపా నియోజకవర్గ బాధ్యులు చల్లా రామచంద్రారెడ్డి రెండు రోజుల క్రితం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా బోయకొండ వద్ద స్థానిక ఆటో యూనియన్ నాయకులు ఆయనకు స్వాగతం పలుకుతూ బ్యానరు ఏర్పాటు చేశారు. దానిని ఆదివారం సాయంత్రం కారులో వచ్చిన కొంత మంది చించి తొలగించిన దృశ్యాలు నిఘా కెమెరాల్లో నమోదైంది. వెంటనే ఈ విషయాన్ని చల్లా రామచంద్రారెడ్డికి తెలిపినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఆయన సూచనల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.